నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 28, 2025 | www.navatelangana.com

అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని పెన్‌గంగ నది నుండి ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని వచ్చిన సమాచారం మేరకు గురువారం ఉదయం సీఐ డి.సాయినాథ్ ఆధ్వర్యంలో ఏఎస్సైలు సిరాజ్, స్వామి, పోలీస్ సిబ్బందితో కలిసి లేకర్‌వాడ వద్ద తనిఖీలు నిర్వహించారు. మూడు ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడ్డాయి. వాటిని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.



పోలింగ్‌కు గట్టి బందోబస్తు : ఎస్పీ గౌస్ ఆలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా జిల్లాలో 400 పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశామని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. గురువారం డైట్ కళాశాలతో పాటు ఇతర పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి ఓటింగ్ జరుగుతున్న తీరుతో పాటు బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. క్యూ లైనోతో పాటు పోలింగ్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం వరకు ఓటర్లను తప్ప ఇతరులను అనుమతించలేదని తెలిపారు. అదే విధంగా రూట్ మొబైల్ పార్టీలను ఏర్పాటు చేసి పర్యవేక్షించామని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం మెటిరియల్‌ను సురక్షితంగా కరీంనగర్‌కు పంపిస్తామన్నారు. ఎస్పీ వెంట పలువురు పోలీస్ అధికారులు ఉన్నారు.



పోటెత్తిన టీచర్లు..వెనుకబడ్డ పట్టభద్రులు..!

- ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికశాతం ఓటింగ్
- శ్రీరాంపూర్‌లో కాంగ్రెస్,బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ
- రోడ్డు బాగు చేయాలని భీంపూర్ మండలంలో ఓటర్ల నిరసన
- ఓటింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలించిన ఉన్నతాధికారులు
- ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల స్థానానికి జరిగిన పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లాలో ఒకటి, రెండు చోట్ల మినహా ఎక్కడా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగలేదు. ఈ పోలింగ్ ప్రక్రియలో ఉపాధ్యాయులు అత్యధికంగా పాల్గొని చైతన్యం ప్రదర్శించగా..పట్టభద్రులు మాత్రం ఓటేసేందుకు వెనుకడుగు వేశారు. తాజాగా జరిగిన పోలింగ్‌లో టీచర్ల పోలింగ్ శాతం ఘననీయంగా నమోదు కాగా..పట్టభద్రుల పోలింగ్ శాతం తక్కువ కావడంతో తీవ్ర నిరాశకు గురి చేసింది. ముఖ్యంగా ఈ ఏడాది కొత్తగా ఓటు హక్కు వచ్చిన పట్టభద్రులు ఉత్సాహంగా ఓటేసేందుకు కేంద్రాలకు తరలిరావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని తీగల్‌పహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలకు మధ్య ఘర్షణ చోటుచేసుకోగా పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టడంతో వివాదం సద్దుమణిగింది. ఇక మిగితా ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 4గంటలకు ముగిసింది. ఉదయం పూట మందకోడిగా ప్రారంభమైన పోలింగ్ సరళి మధ్యాహ్నం వరకు అదే ఒరవడి కొనసాగింది. మధ్యాహ్నం తర్వాత కొంత పెరుగుతూ వచ్చింది. సాయంత్రం వరకు పర్వాలేదనే రీతిలో పోలింగ్ శాతం నమోదైనా ఆశించిన స్థాయిలో జరగకపోవడంతో అందరిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఉపాధ్యాయుల్లో ఓటరు చైతన్యం వెల్లువిరిసింది. టీచర్లు ఉదయం పూటనే కేంద్రాలకు తరలిరావడంతో మధ్యాహ్నం వరకు ఆయా జిల్లాల్లో 75శాతం వరకు పోలింగ్ నమోదు కావడం విశేషం. సాయంత్రం వరకు ఉమ్మడి జిల్లాలో దాదాపు 80శాతం పైగా పోలింగ్ నమోదు కావడం విశేషం.

జిల్లాల వారీగా ఇదీ పరిస్థితి..!

ఎమ్మెల్సీ ఎన్నికలను ఉపాధ్యాయులు ప్రాధాన్యతగా భావించినట్లు కనిపిస్తోంది. ఆయా జిల్లాల వారీగా పరిశీలిస్తే పట్టభద్రుల కంటే అధికంగా వారి పోలింగ్ శాతం నమోదు కావడం గమనార్హం. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా ఉపాధ్యాయుల ఓటింగ్‌శాతం 92.78గా నమోదు కాగా మంచిర్యాలలో 91.77శాతం, నిర్మల్ జిల్లాలో 81.43శాతం, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 90.43 శాతంగా నమోదైంది. పట్టభద్రుల్లోనూ ఆదిలాబాద్ జిల్లాలోనే అత్యధికంగా 69.47శాతం పోలింగ్ నమోదైంది. మిగితా నిర్మల్ జిల్లాలో 66.36శాతం, మంచిర్యాల జిల్లాలో 67.30శాతం నమోదు కాగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 73.23 శాతంగా నమోదైంది.

కేంద్రాల వద్ద ఉత్సాహం..!

పార్లమెంటు ఎన్నికల తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో ఆయా పార్టీలు వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఉదయం పూటనే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. కేంద్రాల సమీపంలో ప్రత్యేకంగా టెంటు వేసుకొని ఓటర్లకు సీరియల్ నెంబర్లు చెబుతూ కనిపించారు. మరోపక్క ఉపాధ్యాయులు సైతం ఆయా సంఘాల వారీగా విడిపోయి వేర్వేరుగా టెంట్లు వేసుకొని కూర్చున్నారు. ఓటేసేందుకు కేంద్రాలకు వచ్చే ఉపాధ్యాయులకు ఓటరు జాబితాలో పేర్లను చూసి క్రమసంఖ్యలు చెబుతూ కనిపించారు. ఓవైపు రాజకీయ పార్టీల నాయకులు, మరోవైపు ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులతో పోలింగ్ కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. జిల్లా ఉన్నతాధికారులు జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.



ఓటు హక్కు వినియోగించుకున్న ఆసిఫాబాద్ కలెక్టర్



ఆదిలాబాద్‌లో ఓటేసేందుకు క్యూలో ఉన్న పట్టభద్ర ఓటర్లు

పట్టభద్రుల స్థానంలో నమోదైన పోలింగ్‌శాతం వివరాలు

జిల్లా	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
ఆదిలాబాద్	14,935	10,396	69.61
నిర్మల్	17,141	11,374	66.36
మంచిర్యాల	30,921	20,811	67.30
కుమురంభీం	6137	4494	73.23

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలైన ఓట్ల వివరాలు

జిల్లా	మొత్తం ఓట్లు	పోలైనవి	శాతం
ఆదిలాబాద్	1593	1478	92.78
నిర్మల్	1966	1601	81.43
మంచిర్యాల	1664	1527	91.77
కుమురంభీం	470	425	90.43

చిన్నపాటి ఘర్షణ..నిరసనలు..!

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ సందర్భంగా అక్కడక్కడ చిన్నపాటి ఘర్షణలు తలెత్తాయి. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని తీగల్ పహాడ్ పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా ఇరు వర్గాలు రాళ్ళు రువ్వుకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న డీసీపీ భాస్కర్, సీపీ శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టడంతో వివాదం సద్దుమణిగింది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలో ఓటర్లు పోలింగ్‌ను బహిష్కరించి నిరసన తెలిపారు. తాము అనేక ఏండ్లుగా రోడ్డు సమస్య ఎదుర్కొంటున్నా పరిష్కారం కావడం లేదని ఈ సమస్యను పరిష్కరిస్తేనే పోలింగ్‌లో పాల్గొంటామని పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ సాయినాథ్ ఓటర్లతో మాట్లాడి వారికి నచ్చజెప్పడంతో వారంతా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫలితాలు మార్చి 3వ తేదీన వెలువడనున్నాయి.



దండేపల్లిలో..



పోలింగ్ సరళి పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



ఓటేసినట్టు చూపుతున్న భీంపూర్ మండల ఓటర్లు



పోలింగ్ కేంద్రంలో నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైంది : కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉందని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫర్ రెసిడెన్షియల్ స్కూల్ బాలురలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ సరళిని పరిశీలించి పలు సూచనలు చేశారు. కల్పించిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఉదయం 8గంటల నుంచి ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. బీఎల్‌ఓలతో పాటు పోలీసు శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. అదే విధంగా మైక్రోఅబ్జర్వను నియమించి ఎలాంటి పొరపాట్లు లేకుండా వెబ్ కాస్టింగ్ చేస్తున్నామన్నారు. పోలింగ్ రోజు సాధారణ సెలవు కూడా ఇచ్చామన్నారు. గాదిగూడలో ఒక టీచర్ ఓటర్ ఉన్నా పోలింగ్ సిబ్బందిని పంపించామని, దీన్ని బట్టి చూస్తే ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువ ఎంతో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట ఆర్డీఓ వినోద్‌కుమార్, డీఎస్పీ జీవన్‌రెడ్డి ఉన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓటింగ్ సరళిని చూస్తే తప్పకుండా తమ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి విజయం సాధిస్తారని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భారీ మెజార్టీతో గెలువబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ జరుగుతున్న తీరును కాంగ్రెస్ శ్రేణులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలని సూచించారు. కాంగ్రెస్ శ్రేణులు నెల రోజుల నుంచి చాలా కష్టపడి పనిచేశారని, నరేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా విశేషంగా కృషి చేశారని, వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కొన్నిచోట్ల ఓటర్లకు అవసరమైన వసతులు కల్పించారన్నారు. ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి ముందువరుసలో దూసుకెళ్తున్నారన్నారు. అంతే ఉత్సాహంతో పట్టభద్రులు సైతం కదిలిచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు కిందిస్థాయి నుంచి పార్టీ నిర్మాణం కోసం ప్రయత్నిస్తున్నారని అన్నారు. వారందరికీ కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పించి గౌరవిస్తుందని పేర్కొన్నారు.

జీఎంగా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న ఏజెంట్‌కు సన్మానం



నవతెలంగాణ - కాసిపేట

సింగరేణి కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు జీఎంగా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. 2022లో మందమర్రి ఏరియా కేకే గ్రూపు ఏజెంట్‌గా బాధ్యతలు చేపట్టి జనరల్ మేనేజర్‌గా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న సందర్భంగా శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ భూశంకరయ్య మాట్లాడుతూ ఉత్తమ అధికారిగా అందరికి అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు చేసి రక్షణ, ఉత్పత్తిలో ముందుంచారన్నారు. అనంతరం రామదాసు మాట్లాడుతూ ఈ ప్రాంత ఉద్యోగులు చాలా సౌమ్యులని, పని సకాలంలో పూర్తి చేసుకోవడంలో ముందుంటారని తెలిపారు. ఇక్కడి వారి నుండి ఎంతో నేర్చుకున్నానన్నారు. అందరి సహకారంతో మరింత ముందుకు వెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణాధికారి నిఖిల్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, సుమన్, మూర్తి, దిలీప్, సంక్షేమాధికారి మీర్జా గౌస్, ఏఐటీయూసీ నాయకులు దాగం మల్లేశ్, మీనుగు లక్ష్మీనారాయణ, రాజేందర్, రవి, ఆశోక్, రంజిత్, ఐఎన్టీయూసీ ప్రచార కార్యదర్శి బన్న లక్ష్మణ్ దాస్, కన్నయ్య, టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి బైరి శంకర్, చొల్లంకి శ్రీనివాస్, నాయకులు డెబ్బటి తిరుపతి, కృష్ణ, అసోసియేషన్ దరావత్ తిరుపతి, బానోత్ తిరుపతి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

చెదురుమదురు ఘటనలు మినహా

- వైరల్ అయిన డబ్బుల పంపిణీ వీడియో
- నాయకులు, పోలీసుల మధ్య తోపులాట

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో గురువారం జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. అధికార పార్టీకి చెందిన అభ్యర్థి తరపున డబ్బులు పంచుతున్న వీడియో వైరల్ అయింది. నస్పూర్‌లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య ఘర్షణ జరగగా పోలీసులు చెదరగొట్టారు. కాంగ్రెస్ పట్టభద్రుల అభ్యర్థి నరేందర్‌రెడ్డి తరపున బుధవారం రాత్రి నస్పూర్‌లోని లిటిల్ రోబోస్ ప్లే స్కూల్‌లో జిల్లాకు చెందిన కొందరు ట్రాస్మా సభ్యులు డబ్బులు పంచుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నస్పూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్న కొందరిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీజేపీ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా రోడ్డుపై బైటాయించారు. సమాచారం అందుకున్న మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, ఏసీపీ ఆర్.ప్రకాష్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మందమర్రి సింగరేణి పాఠశాలలోని పోలింగ్ కేంద్రం సమీపంలో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య గొడవ జరిగింది. పోలింగ్ బూత్ సమీపంలో బీజేపీ మహిళా నాయకురాళ్లు కూర్చున్న స్థలాన్ని కాంగ్రెస్ నాయకులు ఆక్రమించి టెంట్ వేసుకొని కూర్చున్నారంటూ బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు. ఖాళీ స్థలంలోనే తాము టెంటు వేసుకొని కూర్చున్నామంటూ కాంగ్రెస్ నాయకులు పోటీకి దిగారు. ఇరు పార్టీల నాయకులు పోటాపోటీగా నినాదాలు చేసుకోవడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. సీఐ శశిధర్‌రెడ్డి ఇరు గ్రూపులతో మాట్లాడి సమస్య సద్దుమణిగేలా చేశారు. జైపూర్‌లోని పోలింగ్ కేంద్రం 22లో పట్టభద్ర ఓటరు అరిగెల మల్లాగౌడ్‌కు తన ఓటు ఎవరో వేశారని, తనకు న్యాయం కావాలంటూ పోలింగ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపాడు.







కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ

- కమిషనర్ శ్రీనివాస్ రావడంతో సద్దుమణిగిన గొడవ
- గొడవకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం : సీపీ

నవతెలంగాణ-నస్పూర్

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా శ్రీరాంపూర్‌లోని తీగల్‌పహాడ్ జడ్పీ హైస్కూల్లో గురువారం కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. టీచర్, పట్టభద్రుల ఎన్నికలు ఉదయం ప్రశాంత వాతావరణంలో ప్రారంభం కాగా కాసేపట్లోనే తమ నాయకులపై పోలీసులు దాడి చేశారని బీజేపీ కార్యకర్తలు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ వచ్చి వారికి సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. కాసేపటికే మరలా కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఒకరినొకరు బూతులు తిట్టుకుంటూ రాళ్ల రువ్వుకున్నారు. రామగుండం కమిషనర్ శ్రీనివాస్, డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ రాజు ఘటనా స్థలానికి చేరుకొని ఇరుగ్రూపులతో మాట్లాడి అల్లరి మూకలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుందని, గొడవకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.





విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు : సీఐ అశోక్

మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ డ్యూటీలో ఉన్న సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్ విధులకు ఆటంకం కల్గించి ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించిన పబ్బతినేని కమలాకర్‌రావుతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తీగల్‌పహాడ్ ప్రాథమిక పాఠశాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ అమలులో ఉండగా కమలాకర్‌రావుతో పాటు మరికొంత మంది పోలింగ్ బూత్ దగ్గర ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘించి, నిర్దేశించిన హద్దును దాటి అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐ సుగుణాకర్‌తో వాగ్వాదానికి దిగారు. దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారని ఎస్ఐ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | ఫిబ్రవరి 28, 2025 | www.navatelangana.com

ఓటు వేసిన ఎంపీ గోడం నగేష్

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీ గోడం నగేష్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఆయుధమని, అందరూ బాధ్యతతో వేయాలన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న స్వతంత్ర అభ్యర్థి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న సంగె శ్రీనివాస్ గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక రోడ్డు భవనాల శాఖ సబ్ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పోటీలో నిలిచిన వారిలో నిర్మల్ నుంచి ఈయన ఒక్కరే కావడం విశేషం. విజ్ఞులైన పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

• ఎన్నికల సరళిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో వెబ్ కాస్టింగ్‌ను పరిశీలించారు. అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సమయానుసారంగా ప్రతీ రెండు గంటలకు ఒకసారి పోలింగ్ కేంద్రాలలో నమోదైన పోలింగ్ శాతం వివరాలను తెలుసుకోవాలని సూచించారు. అధికారులు వెబ్ కాస్టింగ్‌తో పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్...

జిల్లా కేంద్రంలోని రోడ్లు, భవనాల ఇంజనీరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి నమోదైన ఓటింగ్ శాతం వివరాలను కంట్రోల్ రూమ్ నకు అందజేయాలన్నారు. ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన తాగునీరు, అత్యవసర వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఎన్నికలు పూర్తయ్యేంతవరకు నిరంతరం పటిష్ట పోలీసు బందోబస్తు కొనసాగించాలన్నారు. ఇప్పటివరకు నమోదైన పోలింగ్ శాతం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాలలోకి సెల్ ఫోన్లు అనుమతించకూడదని సూచించారు. వరుసలో నిలబడిన ఓటర్లను, పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని కోరారు. అనంతరం కడెం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఎన్టీఆర్ మినీ స్టేడియంలో...

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం సమీపంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలోని ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాన్ని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్నికల నిర్వహణపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్ని వసతులను, పోలీసు బందోబస్తును ఆయన పరిశీలించారు. ఎప్పటికప్పుడు పోలింగ్ శాతం వివరాలను నమోదు చేసి అధికారులకు అందజేయాలన్నారు.

ఇంద్రవెల్లి : మండల కేంద్రంలోని స్థానిక హైస్కూల్‌లోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం గురువారం వేర్వేరుగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయ, పట్టభద్రులకు ఏర్పాటు చేసిన 37,60 కేంద్రాలోకి వెళ్లి జరిగిన ఓటింగ్ శాతాన్ని, కేంద్రాల్లో ఉన్న మొత్తం ఓటర్ల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికి పీహెచ్‌సీ సందర్శించారు. ఉద్యోగుల హాజరు రిజిష్టర్, పీహెచ్‌సీకి వచ్చే రోజు వారి ఓపీలను పరిశీలించారు. వేసవి కాలంలో సంభవించే వడదెబ్బ వంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నికలు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా వాతావరణంలో జరుపాలని స్థానిక ఎస్సై డి.సునీల్‌కు సూచించారు. దాని కోసం గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంత వాతావరణంలో జరిగింది. జిల్లా వ్యాప్తంగా 16 వేల 528 మంది ఓటర్లకు గాను, 39 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఉదయం నుంచే ఉపాధ్యాయులు ఎక్కువగా వచ్చి ఓట్లు వేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉపాధ్యాయుల పోలింగ్ 75.33 శాతం ఉంటే పట్టభద్రులది 44.09 శాతంగా ఉంది. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మైక్రోఅబ్జర్వర్లు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పట్టణానికి చెందిన స్వతంత్ర అభ్యర్థి మంచికట్ల ఆశమ్మ తన ఓటు హక్కును డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వినియోగించుకున్నారు.

ఎన్నికల సరళిని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి...

ఉమ్మడి ఆదిలాబాద్-కరీంనగర్-నిజామాబాద్, మెదక్ పట్టభద్రులను, కార్యకర్తలకు ఉత్తేజపరుస్తూ అదిలాబాద్ టౌన్‌లో గల సరస్వతీనగర్ పోలింగ్ బూత్, భుక్తాపూర్, తిరుపెల్లి, డైట్ గ్రౌండ్, హ్యాండ్ క్యాప్ కాలనీల్లో ఉన్న పోలింగ్ బూత్‌లను తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్లు ఎన్నికలు పూర్తి అయ్యేవరకు కేంద్రం వద్దనే ఉండాలని సూచించారు. ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు ఓటింగ్ విధానం పైన అవగాహన కల్పించాలని కోరారు. శ్రీకాంత్ రెడ్డి వెంట కాంగ్రెస్ మావల మండలాధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, కుదురుపాక సురేష్, వెంకటేష్, రేండ్ల రాజన్న, గౌతమ్, అడెల్లు పాల్గొన్నారు.

కడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని నిర్మల్ జిల్లా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో కడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించి, ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పటిష్ట పోలీస్ బందోబస్తు కొనసాగించాలన్నారు. అలాగే నిర్మల్ ఎఎస్పీ ఉపేందర్‌రెడ్డి, ఖానాపూర్ సీఐ సైదారావుతో కలిసి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, కడెం ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

దస్తురాబాద్ : మండలంలో కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. ఇందులో భాగంగా మండలంలో గ్రాడ్యుయేట్-283 ఓటర్లు ఉండగా 234 ఓట్లు 83శాతం పోలవ్వగా, ఉపాధ్యాయ ఓట్లు 16 ఉండగా 100శాతం పోలయ్యాయి. అలాగే పోలింగ్ కేంద్రాన్ని నిర్మల్ ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఖానాపూర్ సీఐ సైదారావులు సందర్శించారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు అవసరమైన చికిత్స నిమిత్తం దస్తురాబాద్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దస్తురాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

బేల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. టీచర్స్-20 మందికి ఇరవై పోల్ అవ్వగా, గ్రాడ్యుయేట్ 379కి దాదాపుగా 285 మంది ఓటు వేసినట్లు ఎన్నికల అధికారి వివరించారు. బేల మండల కేంద్రంలో దాదాపుగా 75.19 శాతం ఓటు నమోదు జరిగింది. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సరళని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాసరెడ్డితో పాటు ఆయన సతీమణి కంది మౌనారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాట్లాడుతూ కాంగ్రెస్ బేల మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేసిన ఏర్పాట్ల పైన సంతృప్తి వ్యక్తం చేశారు. వారందరిని అభినందించారు. ఖచ్చితంగా నరేందర్ రెడ్డి యాభై వేల పైచిలుకు ఓట్లతో బంఫర్ మెజారిటీతో గెలుస్తారని అన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావార్, కిసాన్ సెల్ అధ్యక్షులు ఘనశ్యామ్, సామ రూపేష్‌రెడ్డి, బొక్రె శంకర్, కరీం, అవినాష్, మల్లా రెడ్డి, రాజు, సుదాం రెడ్డి, నగేష్ రెడ్డి, సుధాం రెడ్డి పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : మండల కేంద్రంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. ఇందులో భాగంగా మొత్తం 67.45శాతం పోలింగ్ కాగా అందులో ఉపాధ్యాయుల ఓటు హక్కులో భాగంగా 49 మందిలో 48 మంది తమ ఓటు హక్కును నియోగించుకోగా పట్టభద్రులు 371 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 292 మహిళలు 79 మంది ఓటు వేశారు.

తాంసి : పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం తాంసి, భీంపూర్ మండల కేంద్రాల్లో కొనసాగాయి. భీంపూర్ మండలంలో మొత్తం పట్టభద్రుల ఓట్లు 244 ఉండగా, 184 ఓట్లు పట్టభద్రులు తమ ఓట్లను వినియోగించుకున్నారు. 15 ఓట్లు ఉపాధ్యాయ ఓట్లు ఉండగా, 13 మంది ఉపాధ్యాయులు తమ ఓటును ఉపయోగించుకున్నారు. తాంసి మండలంలో 344 పట్టభద్రుల ఓట్లకు గాను, 258 మంది పట్టభద్రులు తమ ఓటును వినియోగించుకున్నారు. 25 ఉపాధ్యాయ ఓట్లకు గాను, 19 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. తాంసి మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లో కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్‌రెడ్డి తమ ఓటు హక్కును క్యూలైన్‌లో నిల్చొని వినియోగించుకున్నారు. తాంసి, భీంపూర్ పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలో ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. సీఐ, ఎస్సైలు పోలీస్ సిబ్బంది, పోలింగ్ కేంద్ర పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుభీర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. దీంతో మండలంలో ఉన్న గ్రాడ్యుయేట్ ఓట్లు 699 ఉండగా, అందులో 467మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉద్యోగులు 63కు 55మంది ఓటు వేశారని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ప్రభాకర్ తెలిపారు. ఎన్నికలు ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు ముగిసాయి. పోలింగ్ బూత్ వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా 144సెక్షన్ విధించి, పోలీస్ బందోబస్తు చేపట్టారు. ఎన్నికలు పర్యవేక్షణ అధికారి నవనీత్ కుమార్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించారు. కుభీర్ ఎస్సై రవీందర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు చేపట్టారు. దీంతో బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిరణ్ కొమ్రెవార్, పార్టీ నాయకులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తలమడుగు : మండల కేంద్రానికి వచ్చిన ఎంపీ గోడం నగేష్ గురువారం తన కార్యకర్త ఇంట్లో కూర్చొని ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆ పార్టీ నాయకులతో చర్చించారు. తప్పకుండా తమ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుస్తాడని, కార్యకర్తలు ఎంపీ నగేష్‌కు విన్నవించారు. అనంతరం ఖోడద్, ఉండం, సుంకిడి, లింగి, కుచులాపూర్, కొత్తూరు, తలమడుగు గ్రామాల వరకు రోడ్డు ఇరువైపులా చెట్లు నాటడంతో ఎంపీ నగేష్ జిల్లా అటవీ శాఖ అధికారులతో సెల్‌ఫోన్ ద్వారా మాట్లాడి ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని మొక్కలు ఎండిపోకుండా ప్రతినిత్యం నీరు అందించే విధంగా చూడాలని డిఎఫ్ఓను కోరారు. అదేవిధంగా కొన్ని గ్రామాల దగ్గర కరెంటు తీగల కింద చెట్లు నాటడంతో విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. అనంతరం ఆ పార్టీ నాయకులు ఎంపీని శాలువాతో సన్మానించారు. ఎంపీ వెంట తాంసి మాజీ జెడ్పీటీసీ రాజు, ఆ పార్టీ నాయకులు కనపర్తి చంద్రకాంత్, బోర్ల వెంకటస్వామి, శారద స్వామి, కైలాస్, రావుల ప్రేమేందర్‌రెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, జక్కుల ప్రభాకర్, కిరణ్, మండల కేంద్ర నాయకులతో పాటు వివిధ మండలాలకు చెందిన కార్యకర్త నాయకులు ఉన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : క్యూలైన్‌లో నిల్చున ఓటర్లు



తలమడుగు : ఓటు హక్కును వినియోగించుకున్నట్టు వేలు చూపిస్తున్న ఓటర్లు

ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలోని స్థానిక పీహెచ్‌సీని జిల్లా కలెక్టర్ రాజార్షిషా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్యూటీ రిజిస్టరును తనిఖీ చేయగా ఐదు గురు సిబ్బంది ఎలాంటి అనుమతి లేకుండా గైర్హాజరు కావడంతో షోకాజ్ నోటీసును జారీ చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్‌కు ఆదేశించారు. గైర్హాజరైన వారిలో ఎంఓ శ్రీకాంత్, సీహెచ్‌ఓ సందీప్, పీహెచ్ఎన్ జ్యోతి, హెచ్ఎస్ సురేష్, ఎంఎల్‌హెచ్‌పీ పూజ ఉన్నారు. అనంతరం డ్రగ్స్ స్టోర్, ఏఆర్‌వీ, కేఎస్‌వీ వాక్సిన్‌లతో పాటు టీటీ ఇంజక్షన్‌లు అందుబాటులో ఉన్నాయా లేదా అని అడిగారు. ప్రసూతి గది, మరుగుదొడ్లు, అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐరన్ మాత్రలు సరిపడా ఉన్నాయా, లేవా అని అడిగి తెలుసుకున్నారు. ఐరన్ మాత్రలను ఆశ్రమ వసతి గృహాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలో విధిగా పంపిణీ చేయాలని ఆదేశించారు. గర్భిణీల వివరాలను ఎప్పటి కప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన వెంట సిబ్బంది రజనీకాంత్, ఎల్డీ అన్సారి ఉన్నారు.

బందోబస్తును పరిశీలించిన ఎస్పీ



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నిర్మల్ పట్టణం, దిలావర్‌పూర్, కుంటాల, భైంసా పట్టణం, ముధోల్, మామడ, ఖానాపూర్‌లోని పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును ఎస్పీ జానకి షర్మిల సందర్శించి, పోలీస్ అధికారులకు, సిబ్బందికి, పోలింగ్ బందోబస్తు, భద్రతపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయమన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తిగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బంది శ్రమించిన తీరు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ ఎన్నికల్లో పోలీసులు ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయము పనిచేయడం ద్వారా ఎన్నికల నిర్వహణ మరింత సులభతరం అయిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేంద్రరెడ్డి, అవినాష్ కుమార్, రాజేష్ మీన, ఇన్స్‌పెక్టర్‌లు ప్రేమ్ కుమార్, గోపినాథ్, నవీన్ కుమార్, సైదారావు, మల్లేష్, ప్రవీణ్ కుమార్, ఆర్ఐ రమేష్, ఎస్ఐ లు సంజీవ్, సందీప్, రాహుల్, కె.సందీప్, సాయి కుమార్, రవి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేల ఎన్నికలను తలపించిన ఎమ్మెల్సీ ఎన్నికలు



నవతెలంగాణ-తలమడుగు

ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఎంపీ ఎమ్మెల్యేల ఎన్నికలను తలపించేలా జరిగాయి. గురువారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. కాగా మండలంలో పట్టభద్రుల 614, ఉపాధ్యాయుల 25, మొత్తం ఓట్లు 639, పట్టభద్రుల 614 ఓట్ల నుంచి 478 పోల్ అయ్యాయి. కాగా, 25 ఉపాధ్యాయ ఓట్ల నుంచి 23 ఓట్లు పోలయ్యాయి, పట్టభద్రుల శాతం 77.85, ఉపాధ్యాయుల శాతం 92.5 నమోదైంది. తాంసి, తలమడుగు ఎస్సైలు అంజమ్మ, రాధికలు గట్టి బందోబస్తు నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు తమ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి.

హజ్‌కు వెళ్లేవారు నియమ నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హజ్ యాత్రకు వెళ్లేవారు నియమ నిబంధనలు పాటించాలని మాస్టర్ ట్రైనర్ ఆల్హ్ మౌలనా సయ్యద్ మజర్ ఖస్మీ అన్నారు. హజ్ సొసైటి ఆదిలాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల కోసం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం టీఎన్జీవోస్ భవనంలో నిర్వహించారు. యాత్రికులు ఎలా వెళ్లాలి. అక్కడ చేయాల్సిన ప్రార్థనలు, ఇతర కార్యక్రమాలను ఆయన వివరించారు. దేవున్ని ప్రసన్నం చేసేలా హజ్ యాత్ర ఉండాలని మాస్టార్ ట్రైనర్ అన్నారు. నియమాలు ఖచ్చితంగా పాటించాలంటే ముందుగా వాటి గురించి తెలుసుకోవాలన్నారు. అక్కడి సౌకర్యాలు, ఇబ్బందుల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్, ఉపాధ్యక్షుడు మహ్మద్ అసీఫొద్దిన్, సంయుక్త కార్యదర్శి ఎంఎ హసీబ్, కోశాధికారి జఫీఉల్లాఖాన్, నూర్‌ఖాన్ పటన్, ఫారూఖ్ అహ్మద్, మహ్మద్ మోసిన్, అబ్దుల్ నసీం, ఎంఎ నహిద్ ఉన్నారు.



అధికారుల హామీతో ఓటేసిన భీంపూర్ ఓటర్లు

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ నుంచి కరంజి వరకు ఉన్న రోడ్డు గుంతలమయమై అధ్వానంగా తయారైంది. రోడ్డు నిర్మాణం చేపడితేనే ఓటు వేస్తామని గురువారం భీంపూర్ మండల జేఏసీ నాయకులు అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ఎంపీ, ఎమ్మెల్యేల చుట్టూ తిరిగినప్పటికీ రోడ్డు నిర్మాణం కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అయినప్పటికీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టడం లేదని అన్నారు. రోడ్డు నిర్మాణం చేపడితేనే ఓటు హక్కు వినియోగించుకుంటామని పట్టభద్రులు పట్టుబట్టారు. దీంతో సీఐ సాయినాథ్ మండల నాయకులతో పాటు పట్టభద్రులతో మాట్లాడారు. రోడ్డు పూర్తిగా గుంతలమయంగా ఉన్న మాట వాస్తవమేనని అన్నారు. పట్టభద్రుడు ఓటు హక్కు వినియోగించుకోక పోవడం సమంజసం కాదని, ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. రోడ్డు నిర్మాణం కోసం సంబంధిత ప్రజాప్రతినిధులు అధికారులతో మాట్లాడుకోవాలని, సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాడే హక్కు మీకు ఉంటుందన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఓ ప్రజా ప్రతినిధి హామీ ఇస్తూ, రోడ్డు నిర్మాణం కోసం రూ.93కోట్లు హైవే నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయని పనులు త్వరగా పూర్తి చేయించే బాధ్యత తనదేనని హామీ ఇవ్వడంతో పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, నవీన్, సంతోష్, ఆఫ్రోజ్‌తో పాటు పలువురు ఉన్నారు.

గ్రామస్తులకు అండగా ఉంటా...

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మారుమూల గ్రామాల ప్రజలకు అండగా ఉంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని మారుమూల గ్రామాలైన హర్కయి, భీమ్లానాయక్ తండాలలో ఆయన పర్యటించారు. గ్రామాల్లో తిరుగుతూ గ్రామ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామస్తుల చిరకాల స్వప్నం ప్రధాన బీటీ రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభించేలా కృషి చేస్తానని అన్నారు. గ్రామ యువకులకు క్రీడా సామగ్రిని అందజేస్తానని తెలిపారు. అంతేకాకుండా గ్రామంలోని ఇద్దరు వికలాంగులకు ఆర్థిక సాయం చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజారాం, మాజీ నెడ్ క్యాబ్ చిలుకూరి భూమయ్య, డుబ్బుల చంద్రశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి



నవతెలంగాణ-నార్నూర్

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని మాజీ జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. గురువారం శివరాత్రి పండుగను పురష్కరించుకుని మండలంలోని చోర్‌గావ్ గ్రామంలో శివమందిర్ ఉత్సవంలో పాల్గొని మాట్లాడారు. మూర్తి రాములు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా తాడిహత్నూర్ గ్రామంలోని శివ్ గణేష్ మండళ్ల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్, ఏఎంసీ మాజీ చైర్మెన్ శ్రీరామ్ నాయక్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, మూర్తి రాములు పీఠాధిపతి శ్రీరామ్ మహారాజ్, సురేష్ మహారాజ్, శివ్ గణేష్ మండలి ఆలయ కమిటీ సభ్యులు, జాదవ్ జితేందర్, ధారాసింగ్ ఉన్నారు.

యువకుడు అదృశ్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న కసబ్‌వాడకు చెందిన యువకుడు అవైస్ అహ్మద్ బుధవారం నుండి కనిపించడం లేదని ఆచూకీ తెలిస్తే తెలియజేయలని యువకుని తండ్రి అమర్ బీన్ అహ్మద్ కోరారు. బుధవారం ఉదయం నల్లటి రంగు స్కూటీ (ఏపీ11ఏ1 2650) పైన బయటికి వెళ్లి కనిపించడం లేదన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 8465931555, 9989259110, 9440874031 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. ఇదే విషయం సీఐ రవీందర్‌ను అడుగగా యువకుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, యువకుడు జైనూర్, ఇంద్రవెల్లి మీదుగా గుడిహత్నూరు వరకు వెళ్లినట్లు కనుగొన్నామని తర్వాత ఎక్కడికి వెళ్లాడనేది కనుక్కోవడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎక్కడైనా అబ్బాయి ఆచూకీ కనిపిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

కొంచవెల్లి బస్టాండ్ కబ్జా

నవతెలంగాణ-దహెగాం



చాలాచోట్ల ప్రయాణపు ప్రాంగణాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కానీ మండలంలోని కొంచవెల్లి గ్రామంలో గల ప్రయాణ ప్రాంగణం కబ్జాకు గురై వినియోగంలో లేకుండా పోయింది. ప్రభుత్వ నిధుల నుంచి పది సంవత్సరాల క్రితమే ప్రయాణికుల సౌకర్యార్థం కొంచవెల్లి గ్రామం నడిబొడ్డున ప్రయాణ ప్రాంగణం నిర్మించారు. కొంతకాలంగా దాన్ని కబ్జా చేసుకొని అందులో ఒక వ్యక్తికి సంబంధించిన సామాగ్రిని పెట్టుకోవడం దాని చుట్టూ అడ్డుగా పరదా కట్టడంతో ప్రయాణికులకు ఉపయోగంలో లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించి ప్రయాణ ప్రాంగణాన్ని కబ్జాను తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

క'న్నీటి'కష్టాలు



నవతెలంగాణ-దహెగాం

అందవల్లి పెద్దవాగు వద్ద వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతుంటంతో మిషన్ భగీరథ నీటిని దహెగాం మండలానికి సరఫరా నిలిపివేశారు. దీంతో మండల వాసులకు కన్నీటి కష్టాలు ఎక్కువైపోయాయి. పది రోజులుగా గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొని ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారు. ఇటు ప్రభుత్వం గానీ అటు సంబంధిత అధికారులు గానీ కనీసం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ప్రజలపై వారికున్న పట్టింపును అర్థం చేసుకోవచ్చు. మండలంలోని చిన్న అయినం గ్రామానికి కనీసం తాగునీటి వసతి కూడా లేకపోవడంతో గ్రామం నుండి సుమారు అర కిలోమీటర్ దూరంలో ఉన్న నేరెళ్ల వాగు చెలిమలో నుంచి బిందెల ద్వారా ఎడ్లబండ్ల ద్వారా కావడీల ద్వారా నీటిని తెచ్చుకొని ప్రజలు తమ గొంతును తడుపుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పై చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుడు ప్రస్తుత కాలంలో కావడీలను మర్చిపోయిన సమయంలో మళ్లీ కావడిని బయటికి తీసి నీటిని తెచ్చుకుంటున్న వైనం.

ఎండీఎం కార్మికులకు పెరిగిన మెనూ చార్జీలు చెల్లించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మధ్యాహ్న భోజనం రాష్ట్ర కార్మికుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకంలోని మెనూ చార్జీలు రూ.74 పైసలు డిసెంబరు నెల నుండి చెల్లించాల్సిందిపోయి ఇంతవరకు చెల్లించలేదన్నారు. కేవలం ప్రభుత్వ అధికారులు నిర్లక్షమేనని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాకు రెగ్యులర్ విద్యాధికారి లేకపోవడం వల్ల కార్మికులకు చెల్లించాల్సిన బిల్లులు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం కార్మికుల క్షేమం ఉత్తమాటేనని ఇలాగే కొనసాగితే తమ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టడం ఖాయమని ఎద్దేవచేశారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న సందర్భంలో ప్రభుత్వ మోడల్ పాఠశాలలో సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీని నిర్వహణలో భాగంగా కార్మికులు తీవ్ర నష్టానికి గురి అవుతున్నారని, నెలల తరబడి పెండింగ్‌లో కోడి గుడ్ల బిల్లులు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

మిర్చి పంటను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని తాటిపెల్లి గ్రామంలో రైతులు పండించిన మిరప పంటను మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప గురువారం పరిశీలించారు. అక్కడ ఉన్నరైతులతో మాట్లాడి పంట మార్పిడి చేస్తే చాలా మంచి దిగుబడి వస్తుందని తెలియజేశారు. ఆయన వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమరం మాంతయ్య, మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్ రావు, మధుకర్, మనీష్, మౌనిష్, సంతోష్, శ్రీనివాస్, రమేష్ ఉన్నారు.

జీఎంను సన్మానించిన ఐఎన్‌టీయూసీ నాయకులు

నవతెలంగాణ-రెబ్బెన

నూతనంగా బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్ రెడ్డిని ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు పెరంశ్రీనివాస్, సెంట్రల్ డిప్యూటీ సెక్రటరీ సంగెం ప్రకాష్ రావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లాస్, నల్లగొండ సదాశివ్, హుస్సేన్, సంజీవరెడ్డి, మందనపు రామారావు, ఏరియా కార్యదర్శులు మాదవ కృష్ణ పాల్గొన్నారు.

హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో...

బెల్లంపల్లి ఏరియా నూతనంగా వచ్చిన జనరల్ మేనేజర్ విజయ్ భాస్కర్ రెడ్డిని హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్యం రాజబాబు, బ్రాంచ్ కార్యదర్శి ఎం.శివారెడ్డి, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్, ఎండి ఓజి ఆర్ జిల్లా అధ్యక్షులు ఎండి గౌస్, బెల్లంపల్లి ఏరియా సెక్రటరీ మారిశెట్టి దత్తు, పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్ శివాలయంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శివరాత్రి ఉపవాసాల విరమణ రోజు అన్నదానం చేయడం అనవాయితీగా వస్తుందన్నారు. శివరాత్రి ఉత్సవాల విజయవంతనికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షులు అశోక్, ప్రముఖులు చిలువేరు వెంకటేశ్వర్లు, మురళి, గంధం శ్రీనివాస్, సతీష్, అక్కు విజయ్, నారాయణ, సతీష్, సాయి, అశోక్, మల్లేష్, దయాసాగర్, శ్రావణ్, ప్రశాంత్, నరసింహ, మధునయ్య పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయంలో

దస్నాపూర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కూడా భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

టీచర్లలో చైతన్యం.. పట్టభద్రుల్లో నిరాసక్తి

- ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్
- పోలీసుల పటిష్ట బందోబస్తు



ఆసిఫాబాద్ : కలెక్టర్ పేరును సరిచూస్తున్న ఎన్నికల సిబ్బంది

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గురువారం జరిగిన ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఆద్యంతం ప్రశాంతంగా జరగగా జిల్లా వ్యాప్తంగా 15 పోలింగ్ కేంద్రాలలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది.

వెనుకబడ్డ పట్టభద్రులు..

గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లాలో 6137 మంది పట్టభద్ర ఓటర్లు ఉండగా 470 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకు పట్టభద్రులు మంది ఓటు హక్కు వినియోగించుకోగా ఉపాధ్యాయులు మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం నుండి కూడా వీరి మధ్య తేడాలు కనిపించాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ మొదటి రెండు గంటల్లో పట్టభద్రులు 366 (5.96శాతం) మంది, ఉపాధ్యాయులు 52 (11 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 12 గంటల వరకు 1247 మంది పట్టభద్రులు, 212 మంది ఉపాధ్యాయులు, మధ్యాహ్నం రెండు గంటల వరకు 2596 మంది పట్టభద్రులు, 350 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోగా, చివరి వరకు జిల్లాలో పట్టభద్రులు 6137 మందికి 4494 మంది (73.23శాతం) ఓటు హక్కు వినియోగించుకోగా, ఉపాధ్యాయులు 470 మందికి 425 మంది(90.43శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్

జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఒకటవ నెంబర్ పట్టభద్రుల ఓటర్ల పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లు ప్రశాంతంగా ఓటు వేసేలా సిబ్బంది చూడాలని, వారికి కావాల్సిన అన్ని వసతులు కల్పించినట్లు వివరించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 15 పోలింగ్ కేంద్రాల వద్ద ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలతో పాటు వాంకిడి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంటర్లను ఎస్పీ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి వస్తువులను లోపలికి అనుమతించకూడదన్నారు. అలాగే ఎలక్ట్రానిక్ వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు.

కెరమెరి : మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తెలిపారు. గురువారం జిల్లాలోని జైనూర్, కెరమెరి మండలాలలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని గ్రాడ్యుయేషన్, జాబితాను పరిశీలించారు. అభ్యర్థుల ఏజెంట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనమండలి సభ్యుల ఎన్నిక పోలింగ్ ప్రక్రియ జిల్లాలో సజావుగా కొనసాగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి వరసలో నిలబడి ఉన్న వారికి చిట్టీలు అందించి వారందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అనంతరం తన గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలీలింగ్ కేంద్రంలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 266 పట్ట బద్రుల ఓటర్లు ఉండగా అందులో 227 మంది ఓటర్లు, ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 4 ఉండగా, నలుగురు కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రులు 85 శాతం, ఉపాధ్యాయులు 100శాతం ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి శ్రవణ్ కుమార్ తెలిపారు. మండల ఎస్సై ఇస్లావత్ నరేష్, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

పెంచికల్‌పేట్ : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండల కేంద్రంలోని పోలింగ్ బూత్ 14, 15లలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. 159 పట్టభద్రుల ఓటర్లకు గాను 134 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2 ఓట్లకు గాను ఇద్దరు ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో 84, ఉపాధ్యాయ ఎన్నికల్లో 100శాతం పోలయ్యాయని ఎన్నికల అధికారి తెలిపారు. పోలింగ్ బూతులను సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా పరిశీలించారు. ఎన్నికలను ఎంపీడీఓ అల్బర్ట్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

సిర్పూర్(టి) : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ మండలంలో 75శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 91 శాతం పోలింగ్ జరిగింది. ఆవరణ ప్రాంతాల్లో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ అధికారులు వసతులు కల్పించారు, ఈ పోలింగ్ కేంద్రాన్ని అదనపు ఎస్పీ ప్రభాకర్ పరిశీలించాగా బందోబస్తు గురించి ఎస్సై కమలాకర్ వివరించారు.



కెరమెరి : పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



పెంచికల్‌పేట్ : పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్



సిర్పూర్(టి): బందోబస్తు గురించి తెలుసుకుంటున్న ఏఎస్పీ ప్రభాకర్

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగంపుల తిరుపతి, ఉపాధ్యక్షుడు లెనిన్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి పెద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. నిధులు విడుదల కాకపోవడంతో డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ పూర్తయిన వారి సర్టిఫికెట్లు తీసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని, వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగ అభివృద్ధికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలతో ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పులి సుశాంత్, అసంపల్లి రవికాంత్, టోగ్రీ సుమిత్, కర్రే అమిత్ కుమార్, వైరాగాడే దీక్షిత్, బెడ్డల పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆర్ఎస్‌పీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బిట్టు శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తమ నాయకునిపై అనుచిత వ్యాఖ్యలు చేసి దుర్భాషలాడటం సరికాదని, అధికారం కోల్పోవడంతో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, వారు అధికారంలో ఉన్నప్పుడు వారి నాయకులు భూకబ్జాలు, అక్రమాలు చేశారని ఆరోపించారు. అలాగే వారి నాయకుల అక్రమ దందాలు కొనసాగకుండా చేయడంతోనే దుర్భాషలాడుతున్నారన్నారు. తమ నాయకుడు ప్రజల గొంతుకై ప్రజల కోసం ప్రజల పక్షాన మాట్లాడుతున్నాడని, నాయకునిపై అసభ్యంగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల నాయకులు రామిల్ల దేవాజీ, యూత్ ఉపాధ్యక్షులు వాసాల రాజవర్దన్, షరీఫ్, పొట్టే గంగారాం, మాజీ ఉప సర్పంచ్ దేవదాస్, బాబులాల్, చింటూ, తులసిరాం, ప్రదీప్ పాల్గొన్నారు.

ఉత్తమ నాయకుల ఎన్నికకు ఓటు కీలకం

చునార్కార్ మనీషా, బాబాపూర్



ఉత్తమ నాయకులను ఎన్నుకోవడానికి ఓటు అనేది చాలా కీలకంగా ఉంటుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడం నాకు కొత్త అనుభూతిని ఇచ్చింది. బ్యాలెట్‌తో ఓటు వేయడాన్ని మర్చిపోలేను.

మొదటిసారి ఓటు హక్కు.. సంతోషం ఇచ్చింది..

అపర్ణ, బాపునగర్, ఆసిఫాబాద్



ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటిసారి ఓటు హక్కు సంతోషాన్ని ఇచ్చింది. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఈ సిద్ధాంతాన్ని సదా నమ్ముతాను.

ఉత్సాహంగా.. బాధ్యతగా..



వారంతా ఇదివరకు ఓటు వేసిన వారే..కానీ అది అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భం. కానీ తాజాగా పట్టభద్రుల స్థానానికి మాత్రం తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెద్దల సభకు అభ్యర్థులను పంపించే కీలక ఓటు కావడంతో పట్టభద్రులు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఓటు హక్కు బాధ్యతను గుర్తు చేస్తూ ఉదయమే కేంద్రాలకు వచ్చి క్యూ కట్టారు. తొలి ఓటు వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికైన నాయకులు సమస్యలపై స్పందించాలి

సాయికుమార్, ఈదులవాడ



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నికైన నాయకులు పట్టభద్రుల సమస్యలపై స్పందించాలి. అప్పుడే నాయకుల పై పట్టభద్రులకు నమ్మకం కలుగుతుంది. ఆ దిశగా కృషి చేస్తారని ఆశిస్తున్నాను.

దివ్యాంగులకు అండగా ఉండాలి

మోర్లే సుధాకర్, స్థానికుడు



ఓటు హక్కు వినియోగించుకోవడం సంతోషంగా ఉన్న ఎంపికైన నాయకులు దివ్యాంగులకు అండగా ఉండాలి. ప్రభుత్వాలు మారుతున్న తమ సమస్యలు పరిష్కారం కావడం లేదు. సమాజంలో తమ పట్ల చిన్నచూపు పోవాలంటే ప్రభుత్వాలు ఆదుకోవాల్సి ఉంటుంది. ఆదుకోవాలని కోరుతున్నాను.

పోలింగ్ కేంద్రాల వద్ద నాయకుల హడావిడి

- ఉపాధ్యాయ సంఘాల సలహా కేంద్రం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీల నాయకులు హడావుడి చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రం వద్ద జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మండల అధ్యక్షుడు మసాడే చరణ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, జిల్లా యూత్ అధ్యక్షుడు గుండ శ్యామ్, బీసీ సంక్షేమ సంఘం రైతు అధ్యక్షుడు మారుతి పటేల్ ఓటింగ్ సరళిని పరిశీలించడంతో పాటు ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తమ అభ్యర్థి గెలుపుపై ఆశభావం వ్యక్తం చేశారు.

టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సహాయ కేంద్రం

ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల ఎన్నికల సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాల సమీపంలో ఓటర్ల సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓటర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించి ఎలా ఓటు వేయాలని విషయాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి, ప్రధాన కార్యదర్శి ఉషన్న, జిల్లా ఉపాధ్యక్షులు సోయం హిందూ రావు, కోశాధికారి రమేష్, జిల్లా కార్యదర్శి హేమంత్ షిండే, నవీన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ వల్లనే నడవగల్గుతున్నా..



నవతెలంగాణ-కౌటాల

మీ వల్లనే నడవగలుగుతున్నాని తాటిపెల్లి గ్రామానికి చెందిన బోయర్ కఫీల్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్పతో అన్నారు. గ్రామానికి చెందిన బోయర్ కఫీల్ గురువారం కుర్తా సిద్ధి హన్‌మాన్ జాతరకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసి గతంలో ప్రమాదంలో కాలు కోల్పోయినప్పుడు మీరు ఇచ్చిన ధైర్యంతో ముందుకు సాగుతున్నానని చెప్పాడంతో ఆయన సంతోషించారు. ఆక్సిడెంట్‌లో తన కాలు కోల్పోవడంతో మాజీ ఎమ్మెల్యే చికిత్సలు చేయించారు. కృత్రిమ కాలు పెట్టించటంలో ఎమ్మెల్యే సహకారం మరిచిపోనని తెలిపారు. అనంతరం తన కృత్రిమ కాలుని చూపిస్తూ తన మనసులోని మాటను తెలియజేశారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ తను బ్రతికి ఉన్నంత కాలం సిర్పూర్ నియోజకవర్గం ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని తెలిపారు. ఆయన వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య పలువురు ఉన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
శుక్రవారం | ఫిబ్రవరి 28, 2025 | www.navatelangana.com

ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

నవతెలంగాణ-లక్సెట్టిపేట



మాదిగ హక్కుల దండోరా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలాల రమేష్ మాదిగ ఆధ్వర్యంలో లక్షటిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణతో పాటు మాదిగలకు రావాల్సిన హక్కుల సాధనే లక్ష్యంగా మాదిగ హక్కుల దండోరా సంఘం ఆవిర్భవించి నేటికీ నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఐదవ సంవత్సరంలో అడుగుపెట్టిందన్నారు. వివిధ సామాజిక అంశాలపై పోరాడుతూనే సేవా రంగంలో కూడా మాదిగ హక్కుల దండోరా ముందువరుసలో ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో దళితులపై దాడులను ఖండించి బాధితులకు అండగా నిలబడిందన్నారు. వర్గీకరణకు గల్లీ నుండి ఢిల్లీ వరకు ఉద్యమాలు నిర్వహించిన ఘనత సంఘానికి ఉదన్నారు.

ఆడిట్ పెండింగ్ సమస్యలపై సమీక్ష

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాకు సంబంధించిన ఆడిట్ పెండింగ్ సమస్యలపై గురువారం ఎస్ఓటుజీఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ఆడిట్ రికవరి వీలైనంత తొందరగా చేయాలని, రికవరికి కావాల్సిన రిపోర్ట్‌ను ఆయా విభాగాల నుండి తీసుకొని త్వరగా రికవరికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం అరవింద రావు, ఫైనాన్స్ మేనేజర్ నాగలక్ష్మి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శేషు కుమారి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మ, సంక్షేమ అధికారి శంకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజేశ్ మృతదేహం లభ్యం



నవతెలంగాణ-జైపూర్

కోటపల్లి మండలం పారుపల్లికి చెందిన రాజేశ్ బుధవారం కోటపల్లి ఎర్రాయిపేట్ శివారు గోదావరి నది మడుగులో మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా రాజేశ్ మృతదేహం గురువారం లభ్యమైనట్లు, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోటపల్లి పోలీసులు తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనతో అతని కుటుంబం రోద్దనపడిందని స్థానికులు పేర్కొంటున్నారు.

సింగరేణి బొగ్గు ధరలు తగ్గించాలి

నవతెలంగాణ-జైపూర్



సింగరేణి బొగ్గు ధర అందుబాటులో లేక తక్కువ ధరకు విదేశాల నుండి బొగ్గును దిగుమతి చేసుకోవల్సి వస్తోందని బొగ్గు ఆధారిత పరిశ్రమల వారు వాపోయారు. గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సీఎండీ బలరామ్ నాయక్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. చిన్న పరిశ్రమల ఆధారంగా వేలాది మంది ఉద్యోగులు ఆధారపడి ఉన్నందున వారికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కూడా మాకు ముఖ్యమని చెప్పుకొచ్చిన వినియోగదారలు పరిశ్రమలు మనుగడ సాధించాలంటే సింగరేణి బొగ్గు ధర తగ్గించాలని కోరారు. సిమెంట్, స్పాంజ్, ఐరన్, సిరామిక్స్, ఫార్మా తదితర పరిశ్రమలు క్లిష్టమైన మార్కెట్ పరిస్థితుల్లో మనుగడ సాధించడం కష్టంగా ఉన్నట్లు తెలిపారు. వేలాది మంది ఉద్యోగులు చిన్న పరిశ్రమలపై ఆధారపడి ఉన్నందున వారి భవిష్యత్ దృష్టితో సింగరేణి బొగ్గు ధర తగ్గించాలని కోరారు. ఎంతో కాలంగా సింగరేణితో ఉన్న అనుబంధాన్ని వదులుకోవాలని మాకు కూడా లేదనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా సింగరేణి వ్యాప్త జనరల్ మేనేజర్లు, క్వాలిటీ జీఎంలు, క్వాలిటీ ఇన్‌చార్జీలతో కలిసి పరిశ్రమల అధిపతులతో తొలిసారి సమావేశమైన సీఎండీ బలరామ్ బొగ్గు నాణ్యతా ప్రమాణాలపై వ్యక్తమైన అభ్యంతరాల పట్ల స్పందించిన ఆయన కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా వినియోగదారుల ప్రయోజనాలు, సింగరేణి మార్కెట్‌ను రక్షించుకునే విషయమై సమాలోచనలు జరిపిన పిదప నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. సుధూర ప్రాంతాల నుండి బొగ్గును దిగుమతి చేసుకున్నప్పటికీ సింగరేణి ధరతో పోల్చి చూస్తే తక్కువ ధరతో లభిస్తుందని వినియోగదారులు వివరించారు.

గతంతో పోల్చితే ఈ ఏడాది కొనుగోలు తగ్గింది : సీఎండీ

గత ఏడాది సింగరేణి ఉత్పత్తి చేసిన 70 మిలియన్ టన్నుల బొగ్గులో 9 మిలియన్ టన్నుల బొగ్గును పరిశ్రమల వారు కొనుగోలు చేశారు. ఈ ఏడాది కేవలం 5మిలియన్ టన్నుల బొగ్గు మాత్రమే తీసుకోవడానికి గల కారణాలు ఈ సందర్భంగా అడిగితెల్సుకున్నారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలివున్న రోజుల్లో సింగరేణి నుండి బొగ్గును కొనుగోలు చేయాలని కోరిన ఆయన ఈ విషయమై త్వరలో మరో సారి సమావేశం ఏర్పాటు చేస్తామని వినియోగదారులకు భరోసా ఇచ్చారు.

చదువుతోనే జీవన శైలిలో మార్పు సాధ్యం



నవతెలంగాణ-కాసిపేట

చదువుతోనే జీవన శైలిలో మార్పు సాధ్యమని, మరొకరిపై ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకోవచ్చని జిల్లా వయోజన విద్యాశాఖ ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తం నాయక్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని విజయ లక్ష్మీ అక్షరాస్యత కేంద్రం, కుట్టు శిక్షణ కేంద్రాల పని తీరును పరిశీలించారు. శివరాత్రి పండుగను పునస్కరించుకొని అక్షర శివరాత్రి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు నేర్చుకోవడం వల్ల సొంతంగా అన్ని పనులు చేసుకోవచ్చన్నారు. సంతకాలు నేర్చుకున్నంత మాత్రాన అక్షరాస్యులుగా పరిగణించబడరని, కనీసం పదాలు రాయడం, చదవడం, చిన్నచిన్న లెక్కలు చేయడం వచ్చినప్పుడే అక్షరసులుగా గుర్తించబడతారన్నారు. అనంతరం అభ్యాసకులను చదివించి వారి సామర్థ్యాలను పరిశీలించారు. ఇందులో డీఆర్పీ బండ శాంకరి, కళాకారులు తిరుపతి, కృష్ణ, భూమమ్మల ఆటపాటతో అందరినీ అలరిస్తూ శివ భజన చేశారు. తదనంతరం భూమమ్మను సన్మానించారు. కార్యక్రమంలో సెక్టోరల్ ఆఫీసర్ సత్య నారాయణ మూర్తి, డీఆర్పీలు ఆశోక్ రావు, సుమన్ పాల్గొన్నారు.

ఘనంగా పౌరాయుని జాతర

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని పెద్దపెట్ గ్రామంలోని అల్లంల పౌరాయుని ఆలయం వద్ద ఏటా శివరాత్రి మరుసటి రోజు జరిగే జాతర మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. యాదవ కులానికి చెందిన అల్లంల వంశస్థులు ఆరాధ్య దైవంగా కొలుస్తారు. వేలాదిగా భక్తుల తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ, మాజీ ఎంపీటీసీ బొడ్డు కమలాకర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

నవతెలంగాణ-జన్నారం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పోనకల్ వీర్లగుట్టపై వెలసిన శ్రీ కేతేశ్వర కాంకాలమ్మ దేవాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని గురువారం అత్యంత వైభవం నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి ప్రముఖులు, భక్తులు తరలివచ్చి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఎస్సై రాజ వర్ధన్ కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ ఎమ్మార్ నరసింహారావు, వైస్ చైర్మన్ చిలువేరు నరసయ్య, కోడిజుట్టు రాజన్న, కృష్ణ పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



లక్సెట్టిపేట : పోలింగ్ తీరు గురించి అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

నవతెలంగాణ-లక్సెట్టిపేట

పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్సెట్టిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మండల తహసీల్దార్ దిలీప్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలిస్తున్నామని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను భద్రతా చర్యల మధ్య కరీంనగర్ లోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో సంబంధిత అధికారులు, పోలింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన రామగుండం సీపీ

పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికల)ను రామగుండం సీపీ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బిఎన్ఎస్ఎస్ యాక్ట్ (144) సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎన్నికల నియమావళిని తప్పనిసరి పాటించాలన్నారు. సీపీ వెంట డీసీపీ రాజు, సీఐ అల్లం నరేందర్, ఎస్సై సతీష్ కుమార్ ఉన్నారు.

తాండూరు : తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి 69.30 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 885 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 614 మంది, 31 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 29 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పర్యవేక్షించి పరిస్థితులను పర్యవేక్షించారు. సీఐ కుమారస్వామి, ఎస్సై కిరణ్ కుమార్ బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాస్ పోలింగ్ ప్రక్రియ సరళిని పర్యవేక్షించారు. జిల్లా సంక్షేమ అధికారి రహుఫ్ స్థానిక పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జన్నారం : మండలంలో గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ, పట్టభద్రుల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఎన్నికల పోలింగ్ నిర్వహించగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్, ఎస్సై రాజవర్ధన్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలో మొత్తం 1423 పట్టభద్రుల ఓటర్లు ఉండగా 1040 మంది ఓటు వేశారు

జైపూర్ : మండల పరిధిలోఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ వనజా రెడ్డి పరిశీలించారు. తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల పరిధిలో పట్టభద్రుల ఓటుర్లు 1095 మంది ఉండగా 772 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 560 మంది పురుష 212 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. టీచర్స్‌లో 11 మంది పురుష, 13 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల పరిధిలో పట్టభద్రుల ఓటింగ్ 60 శాతం, టీచర్స్ ఓటింగ్ 96 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

భీమారంలో...

భీమారం మండలంలో 297 మంది పట్టభద్రులు ఉండగా 201 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ స్టేషన్‌లో 67.67 శాతం ఓటింగ్ నమోదైంది. అదేవిధంగా ఉపాధ్యాయ ఓటర్లు 12 ఉండగా 12 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 100 శాతం పోలింగ్ నమోదైంది.

నస్పూర్ : పట్టభద్రుల ఎన్నికల్లో శ్రీరాంపూర్‌లోని తీగల్వాడ్ జడ్పీహెచ్ఎస్‌లో 65 శాతం ఓటింగ్ నమోదు అయింది. ఉదయం ఓటింగ్ అంతంత మాత్రంగా జరగగా, మధ్యాహ్నం నుండి క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. మొత్తం ఓట్లు 4254 ఉండగా 2783 మంది ఓటు వేశారు.



జైపూర్



జన్నారం



నస్పూర్

బొగ్గు గని పునరుద్ధరణకు ప్రజాభిప్రాయ సేకరణ



అభిప్రాయాలను సేకరిస్తున్న జీఎం

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ అధ్యక్షతన శాంతిఖని భూగర్భ బొగ్గు గని పునరుద్దీకరణ ప్రజాభిప్రాయ సేకరణకు కార్మిక సంఘాలతో సమావేశాన్ని నిర్వహించారు. గురువారం జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం నిజామాబాద్, మంచిర్యాల జిల్లా కలెక్టర్ అనుమతితో శాంతిఖని భూగర్భ బొగ్గు గని ప్రజాభిప్రాయ సేకరణ పునరుద్దరణకు ఐఎన్‌టీయూసీ టీబీజీకేఎస్, సీఐటీయూ, బీఎంఎస్ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం దేవేందర్ మాట్లాడుతూ శాంతిఖని భూగర్భ బొగ్గు గని 1954వ సంవత్సరంలో ప్రారంభించబడినదని, 2006వ సంవత్సరములో (ఎంఓఈఎఫ్ అండ్ సీసీ) మంజూరు చేసిన పర్యావరణ అనుమతి ప్రకారం 681.23 హెక్టార్ల ప్రాజెక్టు ప్రాంతంలో సాలీన 1.167 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్వహించబడుతున్నదని తెలిపారు. ఈ భూగర్భ గని కార్యకలాపాల కోసం అదనపు భూమి అవసరం లేదని, కేంద్ర పర్యావరణ అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ (ఎంఓఈఎఫ్ అండ్ సీసీ) ప్రకటించిన ఎస్ఓ సంఖ్య 1530 (ఈ), తేది 06.04.2018 ప్రకారం పున్దరుద్దరణ విభాగం క్రింద పర్యావరణ అనుమతులకు జారీ చేసిన సూచనల నియమావళిలో ప్రతిపాదించిన విధంగా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతున్నదని తెలిపారు. శాంతిఖని పాత మైన్ ఆఫీసు సమీపంలో ఆకెనపల్లి గ్రామపంచాయతీ, బెల్లంపల్లి మండలం వద్ద ప్రజాభిప్రాయం నిర్వహించబడునని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం విజయ ప్రసాద్, ఎస్కే గ్రూప్ ఏజెంట్ ఖాదీర్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, ఎన్విరాన్‌మెంటల్ సెల్ అధికారి వెంకటరెడ్డి, డివైపీఎం మైత్రేయ బందు, ఐటీ అధికారి రవి, ఐఎన్‌టీయూసీ నాయకులు సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కాంపల్లి సమ్మయ్య, ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య, మిట్ట సూర్యనారాయణ, శంకర్రావు, సెంట్రల్ సెక్రటరి బుచ్చయ్య, శ్రీనివాస్, నరేందర్, టీబీజీకేఎస్ నాయకులు సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ జే రవీందర్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఎస్సీఈయూ సీఐటీయూ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, కుమారస్వామి, సత్యనారాయణ, బీఎంఎస్ నాయకులు, ఏరియా వైస్ ప్రెసిడెంట్ రమేష్, ఏరియా సెక్రటరీ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

భక్త జనులతో కిటకిటలాడిన వేలాల

నవతెలంగాణ-జైపూర్

ఎటు చూసినా భక్త జనం, శివనామస్మరణ, శివసత్తుల కోలాహలం లక్షలాధిగా తరలివచ్చిన భక్తులతో వేలాల గ్రామం కిటకిటలాడింది. కుటుంబ సభ్యులతో తరలివచ్చిన భక్తులు మల్లిఖార్జున స్వామి ఆలయ పరిసరాలు, పంట పొలాల్లో విడిది చేశారు. బుధవారం గట్టుమల్లన్నను దర్శించుకున్న భక్తులు గురువారం ఉదయం వేలాల మల్లిఖార్జున స్వామి సన్నిధికి చేరుకున్నారు. 2వ రోజు కొనసాగిన జాతరలో పాల్గొన్న భక్తులు ఉదయం నుండే బారులుతీరారు. గతేడాదితో పోల్చి చూస్తే ఈ ఏట భక్తులు అత్యధికంగా తరలివచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఆలయ మండపంలో పెద్ద పట్నం వేసిన తదుపరి భక్తులను దర్శనానికి అనుమతించగా నిండు బోనాలతో భక్తులు నైవేద్యం సమర్పించారు. బుధవారం రాత్రి భ్రమరాంభ, ఖేతమ్మ సమేత మల్లిఖార్జున స్వామికి కళ్యాణం జరిపించినట్లు దేవాదాయ శాఖ ఈఓ రమేష్ తెలిపారు. గుట్టపై వెలిసిన గట్టు మల్లన్నను దర్శించుకున్న భక్తులు కాకుండా వేలాల మల్లిఖార్జున స్వామిని దర్శించుకునేందుకు 2 లక్షల నుండి 3 లక్షల మంది భక్తులు హాజరైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా భక్తుల విడిది స్థలాలతో పాటు రహదారులలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు కొనసాగిస్తున్నట్లు మండల పంచాయతీ అధికారి శ్రీపతిబాపురావు తెలిపారు. భీమారం, జైపూర్ మండలాల పరిధిలోని 24 మంది పంచాయతీ కార్యదర్శులు జాతర నిర్వాహణ పనులను పరిశీలిస్తున్నారు. ఉమ్మడి మండల పరిధిలోని 110 మంది గ్రామ పంచాయతీ సిబ్బంది పనుల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. వేలాల మల్లిఖార్జున స్వామి జాతర సందర్భంగా బందోబస్తు పరిశీలించి ముమ్మరం చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. జాతరకు ప్రయివేటు వాహనాల్లో వచ్చే భక్తులు కొంత ఇబ్బందులు ఎదుర్కొవల్సివస్తోంది. ఊరు చివరన పార్కింగ్ ఏర్పాటు చేయడంతో అక్కడి నుండి ఆలయం వరకు పిల్లలు, ఇతర సామాగ్రితో జనసందోహం మధ్య నడుకుంటు వెళ్లడం సమస్యగా మారిందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలను కమాన్ వరకు అనుమతించి కుటుంబ సభ్యులను దింపేసిన తర్వాత వాహనాలను వెనక్కి పంపిస్తే బాగుండేదని అభిప్రాయడ్డారు.



క్యూలైన్ కట్టిన భక్తులు



మోకుదెబ్బ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ఐబి చౌరస్తాలో గురువారం మోకు దెబ్బ క్యాలెండర్ గౌడ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి భూసారపు మొండి గౌడ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై గౌడ కుల హక్కులపై పోరాటాలు చేసిన సందర్భాలను క్యాలెండర్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు. ఇందులో మోకు దెబ్బ రాష్ట్ర నాయకులు శంకర్, భాస్కర్, పున్నం, నవీన్, మాజీ ఎంపీపీ పూసల ప్రణయ్, టైలర్ సుదాకర్, అహ్మదుల్లా, రత్నాకర్ పాల్గొన్నారు.

దాడికి యత్నించిన వారిపై కేసు నమోదు

నవతెలంగాణ-జైపూర్

అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అడ్డుపడిన అటవీ అధికారిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు భీమారం ఎస్సై శ్వేత తెలిపారు. మంగళవారం రాత్రి ఘటన చోటు చేసుకోగా సమాచారం మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా దాంపూర్ రక్షిత అటవీ ప్రాంతం పరిధి నుండి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా అడ్డుపడిన అటవీ అధికారి గడికొప్పుల బాణేష్‌పై భూర్గుపల్లికి చెదిన భుక్య రాజ్‌కుమార్, ఆయన సోదరులు శ్రీనివాస్, బలరామ్, బంధువు అనిల్, దేవ్, రాజేశ్, దరావత్ వంశీలు దురుసుగా ప్రవర్తించినట్లు తెలిపారు. అంతే కాకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌తో అటవీ అధికారి బాణేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడమే కాకుండా ఆయనపై దాడికి ప్రయత్నించినట్లు పిర్యాదు అందిందన్నారు. మేరకు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

సివిల్ సమస్యలపై సీఐటీయూ వినతి పత్రం



నవతెలంగాణ-మందమరి

ఏరియాలోని సివిల్ సమస్యలపై సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సివిల్ ఎస్ఈ రాముకు గురువారం వినతిపత్రం అందజేశారు. సివిల్ డిపార్ట్‌మెంట్‌లో పర్మినెంట్ కార్మికుల సంఖ్యను పెంచాలని, ఎండాకాలంలో ఓసీలలో ఇచ్చిన విధంగా సివిల్ అవుట్ డోర్‌లో పనిచేస్తున్న వారందరికీ మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలన్నారు. ఫిల్టర్ బెడ్‌లలో పంపు డ్రైవర్లకు టార్చ్ లైట్లు ఇవ్వాలని, వాల్వ్ చాంబర్లలో ఇసుక నింపి స్పిండిల్ ఎత్తు పెంచాలని కోరారు. పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్‌ను రిపేరు చేయించి అందుబాటులోకి తీసుకొని రావాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందులో బ్రాంచ్ అధ్యక్షులు వెంకట స్వామి, సివిల్ పిట్ సెక్రటరీ రాజ్ కుమార్, ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డి ఉన్నారు.

ప్రత్యేక కార్యాచరణతో ప్లాంట్ నిర్మాణం



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ 1200 మెగావాట్లకు అనుబంధంగా కొత్తగా ఏర్పాటు చేస్తున్న 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు ప్లాంట్ ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎస్టీపీపీ పరిపాలన భవన్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సలహా సూచనలను పరిగణలోకి తీసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. అనంతరం అధికారులతో ప్లాంటు ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. ఈ సమావేశంలో చీఫ్(ఓఅండ్ఎం)జేఎన్ సింగ్, ఏజీఎం సివిల్ కేఎస్ఎన్ ప్రసాద్, ఏజీఎం ఫైనాన్స్ సుధాకర్, ఏజీఎం ఈఅండ్ఎం మదన్‌మోహన్, 800 మెగావాట్ల ప్లాంట్ కోఆర్డినేటర్ వేణుగోపాల్, ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్ అధికారులు డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారాం పాల్గొన్నారు.

కూటి కోసం కోటి తిప్పలు..

నవతెలంగాణ-జైపూర్



కూటి కోసం కోటి తిప్పలు అన్నట్లు ఓ ముసలవ్వ కిలో బంతి పూలతో వ్యాపారం పెట్టింది. రోడ్డు పక్కన అప్పటి ఒక దుకాణం కొనసాగుతుండగా వారి ఎదుట ఎర్రటి ఎండలో కూర్చునేంత స్థలంలో బంతిపూలు పెట్టుకుని అమ్ముకుంటుంది. వందలు, వేలు లెక్కలేకుండా ఖర్చుపెట్టి వారు సైతం బంతి పూల కోసం ముసలవ్వను గుచ్చిగుచ్చి అడుగుతుంటే అటువైపుగా వెలుతున్న వారు అవ్వ అవస్థలు చూసి జాడిపడాల్సి వచ్చింది. మరో యువకుడు చేతి కర్రను చెట్టంత చేసి పిల్లలు ఆడుకునే బొమ్మలు, పిల్లనగ్రోవులు ఒకటేంటి దుకాణంలో ఉండే అన్ని వస్తువులు తనవద్దే అన్నట్లు రోడ్డుపై అటూ ఇటూ తిరుగుతు వ్యాపారం చేస్తున్నాడు. పిల్లలకు సంబంధించిన వస్తువులు కాబట్టి వాటిని కొనివ్వాలని పెద్దలతో మారాం పెట్టడం. పిల్లల పోరు పడలేక ఎలాగైనా కొంటారని ఆ యువకుడు ఎంత సేపు రోడ్డుకు ఇటూ అటూ తిరుగుతూ వ్యాపారాన్ని కొనసాగించాడు.



మందిర నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్‌కి చెందిన తూముల రామ్ కిషన్ అయోధ్య ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం అందించారు. ఆ మొత్తాన్ని ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులకు ఆలయ నిర్మాణ సమయంలో అందజేశారు. ఇటీవల ఆయన అయోధ్య, కుంభమేళాకు వెళ్లి, వచ్చారు. కాగా గురువారం రామ భక్తులు గ్రామ మాజీ సర్పంచ్ కనక వెంకటేష్, ఉపసర్పంచ్ చిందం చంద్రయ్య, శ్రీనివాస్ సత్తన్న, శేఖర్, బీమయ్యకు అయోధ్య నుంచి తెచ్చిన తీర్థప్రసాదాలు అందించారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ సజన్, శివారెడ్డి, రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పండరి, ప్రతాప్ సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, సుజిల్, లక్ష్మణ్, శ్రీను, కరణ్ సింగ్, శ్రీరామ్, రాజు, నాందేవ్, భావ్ సింగ్, రహీం, సర్దార్, రాజేష్, పాండు, సురేష్, రాజు, ఖదీర్, మల్హారీ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కనబడకుండా పోయిన యువకుడు శవమై తేలాడు. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఖానాపూర్‌కు చెందిన పిట్ల సాయికుమార్(28) ఈ నెల 22నుండి కనబడడం లేదని సోదరుడు గణేష్ 25న ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదైంది. గురువారం ఖానాపూర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కుడి కన్నుకు ఆపరేషన్ కాగా కన్ను నుండి నీరు, చీము కారుతుండడంతో భరించలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆలయాలను దర్శించుకున్న సామాజిక కార్యకర్త



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని టీచర్స్ కాలనీ అభయాంజనేయ ఆలయంతో పాటు భోరజ్ మండలం గూడ శివాలయాన్ని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం తలమడుగు మండలం ఝరి శివాలయంలో అన్న ప్రసాదానికి 2 క్వింటాళ్ల బియ్యం, నందిగామ ఆలయానికి వచ్చే భక్తులకోసం అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు రమేష్, ప్రభాకర్, పురుషోత్తం యాదవ్, భగవాండ్లు, నారాయణ, సుభాష్, రతన్, నారాయణ, రమేష్, విఠల్, శివారెడ్డి, భూమారెడ్డి, రాకేష్ ఉన్నారు.

తొడసం కైలాస్ కృషి అభినందనీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమంలో జిల్లాకు చెందిన కైలాస్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిని ప్రస్తావించిన విషయం గుర్తు చేస్తూ కైలాస్ చేసిన కృషిని డీఈఓ అభినందించారు. గురువారం గిరిజన ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ ఉమాదేవి దంపతులను తన ఛాంబర్లో శాలువాతో సన్మానించారు. గిరిజన భాషలు గోండు, కొలామి, అభివృద్ధికి ఏఐ ద్వారా అభివృద్ధి చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు జే.నారాయణ, శ్రీకాంత్‌గౌడ్, ఉస్మాన్, సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ అధ్యక్షులు కిరణ్ కొమ్రెవార్ బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షులు ఎనిలా అనిల్, వైస్ ఎంపీపీ మోహియొద్దీన్, కందూరు దత్తు, తెలంగాణ ఉద్యమకారుడు పుప్పాల పీరాజీ, గిరి, పోశెట్టి, దొంతుల లింగన్న, బాబు, కాశినాథ్, వద్నామ్ దత్తు, మండల బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

పలు ఆలయాల్లో ఉపవాస దీక్షలు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. గురువారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రెండో రోజు భక్తులు ఉపవాస దీక్షలు విడిచారు. జిల్లా కేంద్రంలోని నగరేశ్వరవాడ, ఓంకారేశ్వర ఆలయం, ఉమా మహేశ్వర ఆలయం, గాంధీ చౌక్ హనుమాన్ టెంపుల్, నటరాజ్ నగర్, వాసవి మాత ఆలయాల్లో భక్తులు ఉదయం ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఉపవాస దీక్షలు విడిచారు. ఆయా ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వైభవోపేతంగా పల్లకిలో ఊరేగింపు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పవిత్ర మహాశివరాత్రి ఉత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో మహిళలు కళశారోహనం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం పవిత్ర ఉపవాస దీక్షను చేపట్టి, మరుసటి రోజున శివనామ స్మరణతో పల్లకిలో ఊరేగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భజన, సంకీర్తనలతో విఠలేశ్వర ఆలయం వరకు చేరుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న డీసీసీ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మామడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు గురువారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సారి పోలింగ్ విధానం చూస్తుంటే పోలింగ్ శాతం పెరుగేలా ఉందని అభిప్రాయ వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ

• జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-వాంకిడి

మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ శ్రీనివాస్ రావుతో కలిసి సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్, వెలుతురు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. జిల్లాలోని అన్ని మండలాలలో ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళని పరిశీలిస్తున్నామని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను భద్రతా చర్యల మధ్య కరీంనగర్‌లోని స్ట్రాంగ్ రూముకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో పోలింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కెరమెరి : మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగింది. పట్టభద్రులకు సంబంధించిన ఓటర్లు 192గాను పురుషులు 130, మహిళలు 32 మొత్తం 162 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన మొత్తం 20 ఓటర్లకు గాను 11మంది పురుష ఉపాధ్యాయులు, ఐదుగురు మహిళా ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా ఆరుగురు ఓటర్లు ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకోలేదు. మొత్తం మీద పట్టభద్రుల పోలింగ్ శాతం 84శాతం నమోదు కాగా, ఉపాధ్యాయుల ఓటింగ్ శాతం 80 శాతం నమోదయింది.

కౌటాల : గురువారం జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ కౌటాల మండలం కేంద్రంలో ప్రశాంతంగా ముగిసింది. ఉపాధ్యాయ ఓటర్లు 25మందికి గాను 23 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ మొత్తం కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల మరియు ఉపాధ్యాయుల నియోజకవర్గానికి ఎన్నికలు జరగగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 12వ నెంబర్ పోలింగ్ కేంద్రంలో పట్టభద్రుల ఓటర్లు 1047 మంది ఉండగా, 700 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 13వ నెంబర్ పోలింగ్ కేంద్రంలో 1082 మంది ఓటర్లు ఉండగా 732 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా 2,129 మంది ఓటర్లకు గాను 1,432 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 67.26 శాతం పోలింగ్ నమోదైంది. అదేవిధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో 209 మంది ఓటర్లకు గాను 194 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోగా 92 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాలను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు సందర్శించి పోలింగ్ తీరును పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్ బందోబస్తు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఉదయమే 12వ నెంబర్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.



కాగజ్‌నగర్ : ఓటేసిన ఎమ్మెల్యే

దండేపల్లి : ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా కొనసాగాయి. మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ శాతం సాయంత్రానికి ఘననీయంగా పెరిగింది. పట్టభద్రులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో పట్టభద్రులకు రెండు పోలింగ్ కేంద్రాలు కేటాయించగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఒక పోలింగ్ కేంద్రాన్ని కేటాయించారు. 28వ పోలింగ్ కేంద్రంలో 69 శాతం పోలింగ్ నమోదు కాగా 29వ పోలింగ్ కేంద్రంలో 70 శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో 95 శాతం ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పర్యవేక్షించారు.

కాసిపేట : మండలంలో గురువారం పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓటు హక్కు కలిగి ఉన్న పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పట్టభద్రుల పోలింగ్ 69.94 శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ 93.75 శాతంగా నమోదైంది. పట్టభద్రుల ఓట్లు మొత్తం 762 ఉండగా 533 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 16 మంది ఉండగా 15 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సారంగాపూర్ : మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 4గంటలకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు టోకెన్ ఇవ్వగా 5.50గంటల వరకు పోలింగ్ కొనసాగింది. పట్టభద్రులు 982 మందికి గాను 731 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 74శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయులు 61మందికిగాను 55 ఓటు హక్కు వినియోగించుకున్నారు. 90శాతం పోలింగ్ నమోదైంది. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



దండేపల్లి : ఓటేసేందుకు క్యూ కట్టిన మహిళా ఓటర్లు



కెరమెరి : ఓటు హక్కును వినియోగించుకున్నట్టు వేలును చూపుతున్న ఓటర్లు

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



సిరికొండ : పల్లకి ఊరేగింపులో భక్తులు

నవతెలంగాణ-సిరికొండ

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తిశ్రద్ధలతో భక్తులు శివుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. మండల కేంద్రంలో శివపార్వతుల పల్లకి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కళ్యాణం వేదమంత్రాలతో ఘనంగా జరిపారు. మండలంలోని కొండాపూర్ గ్రామ సమీపంలోని అతి పురాతమైన శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాలోని ఆయా మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న వాలీబాల్ పోటీలు ముగిశాయి.

బేల: బాధి నందీశ్వర ఆలయంలో గురువారం మాజీ మంత్రి జోగు రామన్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల నిర్మాణానికి అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేసిన ఘనత బీఆర్ఎస్‌కు దక్కుతుందన్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రావుత్ మనోహర్, పార్టీ మండల అధ్యక్షుడు కళ్లెం ప్రమోద్ రెడ్డి, నాయకులు సతీష్ పవార్, జక్కుల మధుకర్, విపిన్ ఖోడే, సంతోష్ బెదుర్కర్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు..

సారంగాపూర్ : మండల కేంద్రంలోని శివాలయం, ఆలూరు, ధని, గోపాల్ పేట్, అడెల్లి, చించోలి(బి), తాండ్ర(జి) గ్రామాల్లోని రాజరాజేశ్వర స్వామి ఆలయం, వంజార్‌లో సంగమేశ్వర ఆలయం, వైకుంఠపూర్‌లోని ప్రభు స్వామి, యకర్‌పల్లెలో బసవేశ్వర శివాలయాల్లో శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తులు ఉదయం నుండే బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకం, బిల్వ పత్రాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి వేళల్లో శివ పార్వతుల కళ్యాణం నిర్వహించారు. యకర్‌పల్లె గ్రామంలో గల బసవేశ్వర్ ఆలయంలో పారిశ్రామికవేత్తలు పడిగెల సత్యనారాయణ, కేదారీనాథ్ కుటుంబ సమేతంగా వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి రుద్రాభిషేకాలు అనంతరం భజన, కీర్తనలతో జాగరణ చేశారు. గురువారం ఉదయం అన్నపూజ, ప్రసాద వితరణ అనంతరం అన్నదానం చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



సారంగాపూర్ : భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జైనథ్

పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం మండలంలోని ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ సరళిని పార్టీ నాయకులను అడిగి తెలుసుకున్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కంది శ్రీనివాసరెడ్డి...

కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి పట్టభద్రుల, ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిపై ఆరాతీశారు. గురువారం మండలంలోని పలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా గెలుపు బావుట ఎగురేస్తుందని, ఆ విశ్వాసం తమకు ఉందన్నారు. ఓటింగ్ సరళిని చూస్తే కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు.,



నాయకులపై లాఠీచార్జికి ఖండన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ బలంగా ఉందని, దీన్ని జీర్ణించుకోలేని అధికార పార్టీ పోలీసులతో బీజేపీ కార్యకర్తలపై లాఠీ చార్జీలు చేయిస్తుందని ఎమ్మెల్యే పాయల శంకర్ ఆరోపించారు. నస్పూర్‌లో బీజేపీ కార్యకర్తపై పోలీసుల లాఠీ చార్జి, గోదావరిఖనిలో న్యాయవాదులపై పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు అధికారపార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ గెలుపు ఖాయమన్న విషయాన్ని గ్రహించిన ప్రభుత్వం పోలీసులతో దాడులకు పాల్పడుతుందని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ ఎస్సై సుగుణాకర్, గోదావరిఖనిలో బీజేపీకి మద్దతు తెలుపుతున్నరని వన్ టౌన్ సీఐ ఇంద్రసేన రెడ్డిలు అనుచితంగా వ్యవహరించారని తెలిపారు. డీజీపీ ఈ విషయంలో చర్యలు తీసుకుంటూ అనుచితంగా వ్యవహరించిన పోలీసులను సస్పెండ్ చేయాలన్నారు. దీనిపై రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘానికి తాము ఫిర్యాదు చేయనున్నామని వెల్లడించారు. సమావేశంలో విజయ్, నగేష్, లాలమన్నా, రఘుపతి, వేదవ్యాస్, దినేష్ మటొలియ, రాజన్న, శివ పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో న్యాయం జరగలేదు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ పదేండ్ల పాలన, కాంగ్రెస్ 14 నెలల పాలనతో ప్రజలు, పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ఎటువంటి న్యాయం జరగలేదని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. డైట్ కళాశాలలో ఓటింగ్ జరుగుతున్న తీరును పార్టీ శ్రేణులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనతో తమకు ఎలాంటి న్యాయం జరగలేదని పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారానికి వెళ్లిన సందర్భంలో తెలిపారన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు లాలామున్న, వేదవ్యాస్, విజయ్, జ్యోతిరెడ్డి ఉన్నారు.